క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



పేదలకు దుస్తులు అందిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పినట్టు పేదల ఆకలి చావులు లేని దేశంగా చూసినప్పుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నారు. ఊర్వశి కూడలి అంబేడ్కర్ భవనంలో సోమవారం పేదలకు అన్న, వస్త్రదానాలు చేశారు. సుమారు 300 మందికి అన్నదానం, 100 మందికి వస్త్రదానం చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, బి.మూర్తి, బి.అప్పారావు, ఎస్.గణేష్, కె.నాగేశ్వరరావు, బి.తిరుపతి, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



కౌంటర్ వద్ద విచారిస్తున్న క్రైం ఎస్ఐ ఎన్.వి.రమణ

మల్కాపురం: మద్యం దుకాణంలో దొంగలు పడ్డారు. కొంత నగదుతో పాటు మద్యం బాటిల్ చోరీ చేసినట్టు వ్యాపారి ఫిర్యాదులో పేర్కొన్నారు.వివరాలు ..మల్కాపురం మెయిన్ రోడ్డులో శ్రీకృష్ణ వైన్స్ షాపు ఉంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు షాపు పై కప్పు (సిమెంట్ రేకు)ను తొలగించారు. దాని ద్వారా లోపలకు ప్రవేశించి షాపులో మద్యం ఫుల్ బాటిల్‌తో పాటు రూ. 50 వేల నగదు చోరీ చేశారు.సోమవారం షాపు తెరవడానికి వచ్చే సరికి రేకు తొలగించి ఉండడంతో పరిశీలించగా.. నగదు లేకపోవడంతో క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం ఎస్ఐ ఎన్వీ రమణ సిబ్బందితో వచ్చి సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

మల్కాపురం: బీసీల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జాతీయ బీసీ సంఘంరాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ అన్నారు. జాతీయ బీసీ సంఘ సమావేశం సోమవారం 58వ వార్డు శ్రీహరిపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల నుంచి సుమారు 100 మంది జాతీయ బీసీ సంఘంలో చేరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తోణంగి వెంకటరమణియాదవ్, ఈగలపాటి యువశ్రీ, సత్యవతి,ఈశ్వరమ్మ,రాజేశ్వరి,నందిని,కర్రి లక్ష్మికుమారి,సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం: ఎస్‌పీడీ, నరసింహనగర్, కొత్తపాలెం 11కేవీ ఫీడర్ల నిర్వహణలో భాగంగా మగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, నరసింహనగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, కొత్తపాలెం, సంతోష్‌నగర్, సూర్యానగర్, డీఏఆర్‌నగర్, ఖర్వేల్‌నగర్, నాగేంద్ర కాలనీ ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి. పురుషోత్తమన్‌ను సోమవారం కలిసి సత్కరించారు.గతేడాది సెప్టెంబర్ నుంచి వేతన బకాయిలు ఉన్నాయన్నారు. మార్చి నెలాఖరు వస్తున్నందున పూర్తి బకాయిలు చెల్లించాలన్నారు. వీఆర్ఎస్ వల్ల కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. తద్వారా ఉన్న కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. ప్లాంట్ ఉత్పత్తికి సహకరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించాలని చూడడం తగదన్నారు. ప్లాంట్‌లో చాలా వరకు ఉన్న భద్రతా లోపాలు ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాదరావు, మద్ది అప్పలరాజు, ప్రభాకరరెడ్డిపాల్గొన్నారు.

ఫుట్ పాట్లు



అడుగుపెట్టలేని విధంగా ఫుట్‌పాత్



ప్రమాదకరంగా ఉన్న ఫుట్‌పాత్ పలకలు



విరిగిన పలక



గోపాలపట్నంలో ప్రమాదకరంగా ఉన్న ఫుట్‌పాత్ డక్ట్ మ్యాన్‌హోల్



డస్ట్ బిన్‌గా వాడుతున్న మ్యాన్‌హోల్



అదమరిస్తే ప్రమాదమే సుమా ..

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు పాదచారుల పాలిట ప్రాణాంతకంగా మారాయి. గోపాలపట్నం సప్తగిరి జంక్షన్ వరకు, అలాగే ఆ జంక్షన్ నుంచి గోపాలపట్నం వచ్చే రోడ్డులో పలు చోట్ల ఫుట్‌పాత్‌లు శిథిలమయ్యాయి. పలకలు విరిగి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఫుట్‌పాత్‌లపై నడిచేవారు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల స్థానిక దుకాణదారులు పాక్షికంగా మూతలు వేశారు. మరికొంత మంది దుకాణదారులు మాత్రం చెత్త వేసుకునే బిన్‌లా వాడుకుంటున్నారు. దీంతో బీఆర్‌టీఎస్ డక్టుల్లో చెత్త భారీగా పేరుకుపోతోంది.మరో వైపు రాత్రి వేళ గుంతలు గమనించక పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- గోపాలపట్నం

త్వరితగతిన అర్జీల పరిష్కారం



అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి పరిశీలించారు. వాటర్ సప్లై విభాగానికి 01, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, డీఈ రామ సుబ్బారావు, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. మద్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతంలో జిందాల్, లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్ , వనితా వాకింగ్ ట్రాక్ , పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు , వాటర్ సప్లై పనులను సోమవారం అధికారులతో కలసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కరాస ప్రాంతంలో త్రీ ఫేజ్ ఎలక్ట్రికల్ లైన్ల పునరుద్ధరణ వంటి అంశాలపై చర్చించారు. పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఉష, ఎలక్ట్రికల్ ఏఈ అర్చన, హార్టికల్చర్ ఏఈ పల్లవి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది,గ్రీన్ బెల్ట్ ప్రతినిధులు, ఈటి సత్యనారాయణ, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు

శ్మశానవాటికలో శివుడి విగ్రహం ఆవిష్కరణ



శివుని విగ్రహం



శ్మశాన వాటికలో మొక్క నాటుతున్న పెద్దలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం శ్మశాన వాటికలో మహా శివుని విగ్రహాన్ని గ్రామ పెద్దలు ప్రారంభించారు. విగ్రహాన్ని స్థానికుడు పసుపురెడ్డి నర్సింగరావు కీర్తి శేషులైన తల్లిదండ్రులు సింహాచలం, అప్పారావు జ్ఞాపకార్థం అందించారు. అలాగే స్థానికులు సమకూర్చిన లాకర్లను కూడా ప్రారంభించారు. జేడీ ఫౌండేషన్ సభ్యులు సమకూర్చిన మొక్కలు నాటారు. తెల్ల మద్ది, స్పోతోడియా, చైనా బాదం , పచ్చ తురాయి వంటి పలు రకాల మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను గ్రామస్తులకు అప్పగించారు.

కోరమాండల్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక



గెలుపొందిన బాషా ప్యానల్

మల్కాపురం: కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆవరణలో సోమవారం కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. సుమారు 344 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా సీహెచ్.నర్సింగరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం .బాషాలను ఏకగ్రీవంగా కార్మికులు ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. బాషా ప్యానల్ తరఫున పోటీ చేసిన అల్లూరి రామరాజుకు 259 ఓట్లు,బి.విశ్వనాథ్‌కు 281 ఓట్లు,పి.సుధాకర్‌కు 300 ఓట్లు, జె.సందీప్‌కు 254 ఓట్లు,ఎం.దినకర్‌కు 224 ఓట్లు వచ్చాయి.విజేతలంతా బాషా ప్యానల్‌కు చెందినవారే. యూనియన్ నాయకులను పలువురు కార్మికులు అభినందించారు.కార్మికుల సంక్షేమానికి పాటు పడతామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

బార్లలో పోలీసుల తనిఖీలు



బార్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు



బార్ అండ్ రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: విశాఖలో బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 450 పోలీస్ అధికారులు, సిబ్బందితో 92 బృందాలుగా 104 బార్లు, పబ్‌ల్లో ఏకకాలంలో తనిఖీ చేపట్టారు. ఇందులో సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం, మైనర్లకు మద్యం విక్రయాలు, ఫైర్ ఎన్‌ఓసీలు, సీసీటీవీ, అక్రమ మద్యం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు ఇలా అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 23 బార్లలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 14 బార్లకు ఫైర్‌ఎన్‌ఓసీ, 2 బార్లలో సీసీటీవీ కెమెరాలు, ఒకచోట ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా 2, పార్కింగ్ సదుపాయం లేకుండా 14, జీఎస్టీ లేకుండా ఒక బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సదరు బార్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు.

అక్కయ్యపాలెంలో చోరీ

17 తులాల బంగారు ఆభరణాలు, రూ.25 వేలు అపహరణ



చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బంగారం, నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అక్కయ్య పాలెం మహారాణి పార్లర్ సమీపంలోని ఎంటీ కాలేజీ రోడ్డులో సరోజా ఆస్పత్రి సమీపంలో ఫొటోగ్రాఫర్ రెయ్యి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. కింది అంతస్తులో తల్లిదండ్రులు వాసుదేవరావు, లక్ష్మీకాంతమ్మ ఉంటున్నారు. గోపాలపట్నం సమీపంలోని చంద్రంపాలెంలో తమ కుమార్తె ఇల్లు కట్టుకోవడంతో చూసేందుకు వాసుదేవరావు, లక్ష్మీకాంతం వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండిపోయారు. కుమారుడు శ్రీనివాసరావు రాత్రి పది గంటలసమయంలో ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఉంటున్న దిగువ పోర్షన్‌కు వచ్చి చూడగా..ఇంటి తాళాలు తెరిచి ఉండడం గమనించి బీరువా తనిఖీ చేయగా 17 తులాల బంగారం ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించారు. నాలుగు గాజులు, రెండు చైన్లు, నల్లపూసల దండ, మూడు ఉంగరాలు, చెవిదుద్దులు, రూ.25వేలు చోరీ అయ్యాయని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం మీద రూ.4.50 లక్షల మేరకు చోరీ జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలానికి క్రైం డీసీపీ లతా మాధురి , ఏసీపీ లక్ష్మణరావు, సీసీఎస్ సీఐలు కోరాడ రామారావు, శంకరనారాయణ, ఫోర్త్ టౌన్ క్రైం సీఐ రాజులునాయుడు, ఫోర్త్ టౌన్ క్రైం ఎస్ఐ సత్యారావు చేరుకుని వివరాలు సేకరించారు.పరిసరాలను పరిశీలించారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును సీఐ రాజులనాయుడు పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



ఆర్పీ పేట పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు



కంచరపాలెంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న దివ్యాంగ విద్యార్థి



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయుడు

గోపాలపట్నం: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా సమయం కంటే గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు సెంటర్లలో పరీక్షలు జరిగాయి.

సందడిగా పరీక్ష కేంద్రాలు

కంచరపాలెం: కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, మద్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటలకే తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్, ఏకేఎం జూబ్లీ, కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట హైస్కూల్, ఐటీఐ జంక్షన్ పరిధి కప్పరాడ ఉన్నత పాఠశాలల్లో తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సేవలందించారు.

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలో,శ్రీహరిపుం,గాంధీగ్రామ్ జీవీఎంసీ పాఠశాలలో పాటు శ్రీహరిపురం వద్ద గల భాష్యం,సరస్వతి విద్యా విహార్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1041 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది ప్రైవేట్‌గా హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కుమార్తెకు ధైర్యం చెప్పి పరీక్షకు పంపుతున్న తల్లి



మల్కాపురం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



పరీక్షకు ఆలస్యంగా రావడంతో బయట ఉన్న విద్యార్థులు

టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రమణ

పెదగంట్యాడ: మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జోన్-1 రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ అన్నారు. ప్రభుత్వ న్యూ ఐటీఐలో టాటా స్ట్రైవ్ అండ్ సీమెన్స్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్‌లో కొత్త టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీపై ఐదు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం టాటా గ్రూప్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్ డాక్టర్ జాఫిన్, స్నేహాల్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా మారిషస్ జాతీయ దినోత్సవం



మారిషస్ జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటున్న నావికాదళ అధికారులు

సింధియా: ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధి విశాఖలో సన్‌రైజ్ ఫ్లీట్‌ను ఐఎన్ఎస్ సుమేధ వద్ద ఎంసీజీఎస్ వాలియంట్ సిబ్బందితో కలిసి మారిషస్ జాతీయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మిత్రదేశాలుగా ప్రతిష్ఠి గాంచిన ఈస్ట్ ఆఫ్రికా దేశానికి చెందిన మారిషస్, భారతీదేశం అనేక సముద్రప్రాంతాల్లో భద్రత, తీరప్రాంత వృద్ధి కోసం బలమైన సంబంధాలను కలిగి ఉన్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

నేవీ మారథాన్‌కు సన్నాహాలు



సన్నాహక పరుగులో పాల్గొన్న నేవీ ఉద్యోగులు, నగరవాసులు

ఏయూక్యాంపస్: నేవీ మారథాన్‌కు సన్నాహకంగా ఐఎన్ఎస్ కళింగ, సింగ్పి ఇండస్ట్రీస్‌తో సంయుక్తంగా తొలి కండీషనింగ్-స్ట్రెంత్ ట్రైనింగ్ రన్‌ను బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ పరుగులో 350 మందికి పైగా పాల్గొన్నారు. విశాఖ నేవీ మారథాన్‌లో పాల్గొనేవారికి సన్నాహకంగా వీటిని నిర్వహిస్తున్నారు. ప్రతీనెల రెండో శనివారం ఆరోగ్య జీవనాన్ని ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలు.. అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన తరిమిరెడ్డి నర్సింగరావు స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్-2 విభాగంలో స్కిల్డ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 13న అతను నైట్‌షిఫ్ట్‌కు విధులకు హాజరయ్యాడు. రాత్రి ఒంటి గంట సమయంలో చెకింగ్ విధులు నిర్వహిస్తుండగా సుమారు 7 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి.. ఆ తర్వాత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ కావడంతో ఆదివారం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఐటీఐలో జాబ్ మేళా

పెదగంట్యాడ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి శాఖ సంయుక్తంగా ఐటీఐ పాస్ అయిన, అప్రెంటిస్ , డిగ్రీ , డిప్లమో, ఇంజినీరింగ్ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.